క్లుప్తంగా

వంట నిర్వాహకులపై ఎంఈఓ ఆగ్రహం



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ సుభాన్

పగిద్యాల: జగనన్న గోరు ముద్ద ఆహార పట్టిక మెనూ ప్రకారం భోజనాలు తయారు చేయకుండా ఇష్టానుసారంగా వంటకాలు తయారు చేసిన ఏజెన్సీ నిర్వాహకులపై ఎంఈఓ సుభాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కొత్త పాలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పప్పు చారు తయారు చేయాల్సి ఉండగా అది నీళ్ల మాదిరిగా తయారు చేయడాన్ని గమనించి ఆగ్రహం చెందారు. రుచి, శుచి లేని ఆహారాన్ని పిల్లలు ఏలా భోంచేస్తారని, వారి ఆరోగ్యం దెబ్బతినదా అంటూ మండిపడ్డారు. మెనూ ప్రకారం రుచికరంగా తయారు చేయలేదని, అందులో పిల్లలకు సరిపడా పోషకాలు లోపించాయని నోటీస్ జారీ చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య

పాములపాడు: ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్యా అవకాశం కల్పిస్తున్నట్లు ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో విలేకరులతో మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలు, భూమి లేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగంచేసుకవచ్చన్నారు. ప్రభుత్వ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్12(1)(సి) ప్రకారం 25శాతం సీట్లు అర్హులైన వారికి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో రిజర్వు చేయబడ్డాయని వివరించారు. 5-6 సంవత్సరాల్లోపు పిల్లలు 1 వ తరగతిలో అడ్మిషన్ ఉచితమని, ప్రవేశానికి www.cre.ap.gov.in/QTE వెబ్‌సైట్‌ను సందర్శించాలని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 10 అని తెలిపారు.

రన్ ఫర్ జీసస్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఎస్ఐ చర్చి సంఘస్తులు

నందికొట్కూరు: పట్టణంలోని ప్రధాన రహదారి, వీధుల వెంట సీఎస్ఐ టౌన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం చేపట్టారు. ఏసుక్రీస్తు గురించి పాటలు, వాక్యం ద్వారా ప్రజలకు వివరించారు. వీధుల వెంట ఏసుక్రీస్తు పాటలు పడుతూ క్రైస్తవులు ముందుకు సాగారు.

సేవలతోనే యువతకు గుర్తింపు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కిట్టు

మహానంది: గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతకు గుర్తింపు లభిస్తుందని గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు తెలిపారు. గాజులపల్లెమెట్ట వద్ద శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రాజు, ముజీబు, హుస్సేన్, కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో బీహార్ డీఐజీ పూజలు

మహానంది: బీహార్ డీఐజీ క్రాంతి సతీసమేతంగా శనివారం మహానంది వచ్చారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చనలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక యాగశాలలో ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి, వేదపండితులచే ఆశీర్వచనం చేయించారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: గాజులపల్లెలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయార్చకులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మేళతాళాలు , మంగళవాయిద్యాల మధ్య స్వామివార్ల గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ,శ్రీసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



చెక్క సామగ్రి స్థానంలో ఇనుప సామగ్రి విక్రయాలు,



చెక్క చక్రాల స్థానంలో టైర్లు, ఇనుప పరికరాలు,



బసవన్నలకు అలంకరణ సామగ్రి

రైతు జాతర వెలవెల

- కలప స్థానంలో ఇనుప పనిముట్లు
- అధిక ధరలు ఉండటంతో రైతులు వెనుకంజ



చెక్కబండ్లు పోయి ఇనుపబండ్లు వచ్చే....



రైతన్నల వ్యవసాయ పనిముట్లు...

జూపాడుబంగ్లా: నాగలి, గొర్రు, గుంటిక, ఎడ్ల బండ్లే కాదు చెక్కతో చేసిన ఏ పనిముట్టైనా తర్తూరు జాతరలో ఇట్టే దొరికేవి. తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా రైతులు తర్తూరు జాతకు తరలి వచ్చి తమకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు తీసుకెళ్లేవారు. కలపతో చేసిన ప్రతి పనిముట్టు ఇక్కడ లభిస్తుండటంతో రైతన్నల జాతరగా ఎంతో ప్రసిద్ధి. అయితే ఇదంతా పదిహేనేళ్ల క్రితం మాట. ఇప్పుడు ఏడాదికేడాది జాతర కల తప్పుతోంది. అటవీశాఖ అధికారులు తర్తూరు జాతరకు కలపను తరలించకుండా కట్టడి చేయటంతో క్రమేణా జాతరలో కలప విక్రయాలు కనుమరుగయ్యాయి. అడవిలో చిన్నపాటి చెట్టు నరికినా ఫారెస్టు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటుండటంతో జాతరకు కలపను తెచ్చే పొలపర్లు లేకుండా పోయారు. ఫలితంగా ఇనుప బండ్లు, ఇనుప నాగలి, గొర్రు, విత్తనం గొర్రు, పళ్లగొర్రు దర్శనమిస్తున్నాయి. వ్యవసాయం మానుకోలేని రైతులు తప్పని పరిస్థితిలో ఇనుప పరికరాలను కొనుగోలు చేయటానికి వెళ్తే వ్యాపారులు చెప్పే ధరలకు కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. తర్తూరు జాతరకు పూర్వవైభోవం తెచ్చే నాథుడే లేకపోవటంతో క్రమేణా తర్తూరు జాతర నామరూపాల్లేకుండా పోయే ప్రమాదం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జాతరలో జోరుగా మద్యం విక్రయాలు

- కర్ణాటక, తెలంగాణ, ఏపీ మద్యం బాటిళ్ల అమ్మకం
- గుడుగుడు ఆటలతో భక్తుల జేబులు గుల్ల



జాతరలో మద్యం సేవిస్తున్న మందుబాబులు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో కర్ణాటక, తెలంగాణ, ఏపీ మద్యం అక్రమంగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్ల నుంచి తర్తూరు జాతరలో మద్యం విక్రయాలకు ఎలాంటి అనుమతుల్లేవు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది అక్రమంగా మద్యం విక్రయాలకు తెరతీశారు. జాతరకు వచ్చే భక్తులు కడ్డీల మాంసం తినకుండా వెనుదిరగరు. మాంస ప్రియులు మద్యం సేవించకుండా మాంసాహారాన్ని భుజించరు. వారి వీక్‌నెస్‌ను ఆసరాగా తీసుకొని తర్తూరు జాతరలో కడ్డీల మాంసం విక్రయించే అయ్యవారితోట పరిసర ప్రాంతాల్లో సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి 12గంటల వరకు జోరుగా మద్యం విక్రయిస్తున్నారు. తర్తూరు జాతరలో మద్యం అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విషయం తెలిసినా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొని జాతరలో మద్యం విక్రయాలను నివారించాలని భక్తులు కోరుతున్నారు.

దాడులు నిర్వహిస్తాం..

ఈ విషయమై సివిల్ సీఐ సుధాకర్‌రెడ్డి, సెబ్ సీఐ రమేష్‌రెడ్డి లను వివరణ కోరగా మూడు రోజుల క్రితం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేశాం. ఇంకా జాతరలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంది. సరైన సమాచారం అందితే దాడులు నిర్వహించి మద్యం విక్రయ దారులను అరెస్టుచేసి జాతరలో మద్యం విక్రయించకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుడుగుడు ఆటలు

తర్తూరు జాతరలో అయ్యవారితోటలో గుడుగుడు ఆటలు పెట్టి భక్తుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. వాస్తవానికి స్కిల్‌గేమ్‌లను నిషేధించారు. అయితే కొందరు జాతరలో నిషేధించిన స్కిల్‌గేమ్స్‌ను నిర్వహిస్తూ ఆటగాళ్లు భక్తుల జేబులను గుల్ల చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్

తర్తూరు జాతరలోకి ఆటోలు, ద్విచక్రవాహనాలను అనుమతిస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జాతరకు ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. వాస్తవానికి జాతరలోకి ఆటోలు, ద్విచక్రవాహనాలను అనుమతించకుండా గ్రామశివారులోనే నిలువరించాల్సి ఉంది. బైపాస్‌రోడ్డు మీదుగా ఆటోలు, ద్విచక్రవాహనాలు జాతరలోకి ప్రవేశిస్తుండటంతో ఇరుకైన రోడ్లపై భక్తులు నడవలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకొని జాతరలోకి ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకుండా చర్యలు తీసుకొని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చేయాలని కోరుతున్నారు.

సీఆర్‌పీలు బాధ్యతగా పనిచేయాలి

పగిద్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, ఆయా క్లస్టర్ పరిధిలో నియమింపబడిన సీఆర్‌పీలు బాధ్యతతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంఈఓ సుభాన్ ఆదేశించారు. శనివారం స్థానిక విద్యాధికారి కార్యాలయంలో టీచింగ్ అట్ రైట్ లెవెల్(తర్ల్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మూల్యాంకనం చివరి పరీక్షల డేటా ఎంట్రీని వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ శ్రీధర్, పాల్గొన్నారు.

ఆటో నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

పగిద్యాల: నందికొట్కూరు పట్టణం నుంచి లక్ష్మాపురానికి ఆటోలో బయలుదేరిన ఓ వ్యక్తి మార్గమధ్యంలో బాదనమ్మ సమీపాన కిందపడి గాయాలపాలయ్యాడు. శనివారం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మునిస్వామి కల్లు తెచ్చుకోవడానికి నందికొట్కూరు పట్టణానికి వెళ్లాడు. అక్కడ కల్లు తాగి క్యాన్‌లో 5 లీటర్ల కల్లు తీసుకుని పడమర ప్రాతకోటకు ఆటోలో డ్రైవర్ ప్రక్కన కూర్చుని బయలుదేరాడు. మత్తులో తూలి కింద పడ్డాడు. తలకు బలంగా గాయమై చెవుల నుంచి రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. అతనిని 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

11 మంది విద్యార్థులు గైర్హాజరు

కొత్తపల్లి: మండల కేంద్రంలో జరుగుతున్న పది పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి మోహన్‌బాబు, డిపార్ట్‌మెంటల్ అధికారి గాలీబ్ అహమ్మద్ తెలిపారు. ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 186 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరు అయ్యారని, కస్తూర్బాగాంధీ బాలికల పరీక్షా కేంద్రంలో 96 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు పరీక్ష రాయలేదని వెల్లడించారు.

ప్రచార యాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు: కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనగా వామపక్ష పార్టీలు చేపట్టిన ప్రచార యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో శనివారం ప్రచార యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 30 వ తేది వరకు ప్రచార యాత్రను అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

సామాన్య భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయం



ప్రధానాలయ రాజగోపురం వద్ద మంత్రి దంపతులకు ఆహ్వానం పలుకుతున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లన్న దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను శనివారం ఆయన దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్.లవన్న, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.75 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మే 31న శ్రీశైలక్షేత్రంలో లోకకల్యాణార్థం మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం నుంచి దోర్నాల వరకు రైల్వే మార్గాన్ని, దోర్నాల నుంచి శ్రీశైలం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తామన్నారు.

అలగనూరు వృషభాల జయకేతనం



విజేతలైన ఎద్దుల యజమానులకు బహుమతులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో శనివారం నిర్వహించిన ఆరుపళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీల్లో మిడుతూరు మండలం, అలగనూరుకు చెందిన రోలమేడం వృషభాలు విజయకేతనం ఎగురవేశాయి. పోటీల్లో 17 జతల వృషభాలు పోటీపడగా అలగనూరు ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ.40వేలు నగదును గెలుపొందాయి. ఓర్వకల్లు మండలం, మంగళిపల్లెకు చెందిన మురళీమోహన్ ఎద్దులు రెండోస్థానంలో రూ.30వేలు, చాగల్లుకు చెందిన వై.ఆదినారాయణ వృషభాలు తృతీయస్థానంలో నిలిచి రూ.25వేలు దక్కించుకొన్నాయి. జూపాడుబంగ్లా మండలం, తంగడంచకు చెందిన గంగిరెడ్డి గారి ఈదుల రమణారెడ్డి ఎద్దులు నాల్గొవ స్థానంలో రూ.10వేలు, ఏ.కోడూరుకు చెందిన చాగంటి నాగేశ్వరరెడ్డి వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.5వేలు కైవసం చేసుకొన్నాయి. నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసిసుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, గార్గేపురం గ్రామానికి చెందిన జూటూరు లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్టణానికి చెందిన కె.వీరభద్రం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు అందజేసి సత్కరించారు.

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట, పైపులు చూపుతున్న రైతులు

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామ పరిధిలోని 519 సర్వే నంబర్‌లోని 6 ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న పంట శుక్రవారం దగ్ధమైంది. అలాగే పొంలోని లింకు, కేసింగ్ పైపులు, బోరు బావుల వద్ద ఉన్న స్టార్టర్లు కాలిపోయాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు 519 సర్వేనంబర్‌లో సునీత 1.50 ఎకరాలు, నాగలక్ష్మమ్మ 2 , సంజీవ 1.50, సంజీవ ఎకరంలో మొక్కజొన్న సాగు చేపట్టారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలలో భాగంగా రైతులు ప్రార్థనామందిరాలలో ఉండగా మధ్యాహ్న సమయంలో నిప్పంటుకొని కాలిబూడిదయ్యింది. దీంతో రైతులకు లక్షల రూపాయలలో నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న గ్రామ వీఆర్వో ప్రసాదు, వీఆర్ఏ రమణ ఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందజేసి బాధిత రైతులను ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ నాగారెడ్డి స్వామిరెడ్డి కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు అతికిస్తే చర్యలు

నంద్యాల(సిటీ): పోస్టర్ ఫ్రీ పట్టణంగా నంద్యాలను తీర్చిదిద్దేందుకు చర్యలకు ఉపక్రమించినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా కరపత్రాలు, పోస్టర్లు, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు అతికిస్తే చర్యలు తప్పవని గతేడాది ఫిబ్రవరి 22న తెలియజేశామని గుర్తు చేశారు. నిబంధనలు అతిక్రమించిన యువిన్ అకాడమీ సంస్థకు రూ.10వేలు జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలకు పట్టణ 2టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అనుమతి లేకుండా పోస్టర్లు అతికించరాదని హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఆదేశాలను అతిక్రమిస్తే 1997 యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- 5 గ్రామాల్లో మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమం
- ఇంటింటికి వెళ్లి కుటుంబీకులతో మాట్లాడిన ఎమ్మెల్యే ఆర్థర్
- కుటుంబ సభ్యుల ఆమోదంతో స్టిక్కర్ అతికింపు



మద్దూరులో ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజల అభిప్రాయాలు రాస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి ఆదరించాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం మండలంలోని మద్దూరు, వేంపెంట, బానకచెర్ల, బానుముక్కల, యర్రగుడూరు గ్రామాల్లో నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రతి గ్రామంలో 10 నుంచి 12 కుటుంబాల సభ్యులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం, పనితీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకొని, ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నాపత్రాన్ని పూరించారు. వారి మొబైల్ ఫోన్ నుంచి 8296082960 నంబరుకు మిస్డ్ కాల్ చేయించారు. వారి మద్దతుతో స్టిక్కర్‌ను ఆ ఇంటి గోడకు అంటించారు. ఐదు గ్రామాల్లో 58 కుటుంబాలతో మాట్లాడి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, సర్పంచు మాణిక్యమ్మ, ఎంపీటీసీలు బషీర్ అహ్మద్, సంజమ్మ, సొసైటీ చైర్మన్లు చౌడయ్య, ఎల్వీ రమణారెడ్డి, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన మా నమ్మకం నువ్వే జగన్

మహానంది: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మహానంది మండలంలో కొనసాగుతుంది. శనివారం గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో ఉప సర్పంచ్ శేషుగౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. అలాగే అబ్బీపురంలో జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి , సర్పంచ్ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సునిత, నాయకులు లక్ష్మీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిపారు. నందిపల్లెలో సీనియర్‌నేత పెద్ద మహానంది రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

శ్రీశైలంలో 'జగనన్నే మా భవిష్యత్'



శ్రీశైలంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంటెంపుల్: వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎమ్ రజాక్ పర్యవేక్షణలో శనివారం శ్రీశైలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. 4 వ సచివాలయ కన్వీనర్ జిల్లెల లక్ష్మీదేవి 8, 9,10 వార్డుల్లో పర్యటించారు. ప్రతి గడప తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల నుంచి ప్రభుత్వంపై ఎటువంటి అభిప్రాయం ఉన్నదో తెలుసుకుంటున్నారు. కార్యక్రమంలోగృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పైనే ప్రజలకు నమ్మకం

ఆత్మకూరు: సీఎం జగన్‌పై ప్రజలకు నమ్మకం ఉందని ఆత్మకూరు కో ఆప్షన్‌సభ్యుడు రషీద్ అన్నారు. శనివారం 13వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్‌కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం గృహసారథులు , వలంటీర్లు, కన్వీనర్లు సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. 10వ వార్డులో వార్డుకౌన్సిలర్ షేక్షావలి, షంషూర్, మస్తాన్, 19వ వార్డులో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, చంద్రశేఖర్, ముర్తుజా, 2 వార్డులో వార్డు కౌన్సిలర్ విజయ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, షంషూర్ ఆధ్వర్యంలో, కురుకుంద గ్రామంలో కోట్ల రాజ్యలక్ష్మి, కోట్ల నాగేశ్వరరెడ్డి, బందెలమాబు, కురుకుంద శంకర్‌రెడ్డి, ముష్టపల్లి లో సర్పంచ్ రవినాయక్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజల చెంతకే సంక్షేమం



జగనన్న మా నమ్మకం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ లాలం రమేష్

వెలుగోడు: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజల చెంతకే సంక్షేమ పాలన అందుతోందని, భవిష్యత్‌లోనూ ఈ ప్రభుత్వమే కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. మండలంలో రెండో రోజు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గృహసారథులు నిర్వహించారు. వారు ప్రతి ఇంటికి తిరుగుతూ వైఎస్ జగన్ పాలనలో జరుగుతున్న మంచి గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత జగనన్న సంక్షేమ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయ్యిందని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామని, పథకాలు అందుతున్న తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను తమ ఇళ్లకు తగిలించుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కే.రామ్మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, షంషీర్ అలీ, తెలుగు రమణ, షాషావల్లి, ఎంపీటీసీలు రాజేష్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు పకడ్బందీ చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని రుచి చూస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణయ్య

జూపాడుబంగ్లా: వైద్య ఆరోగ్య సిబ్బంది మాతా శిశుసంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, గర్భిణులు సుఖప్రసవం పొందేలా చూడాలని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణయ్య ఆదేశించారు. శనివారం ఆయన బ్రాహ్మణకొట్కూరు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే జూపాడుబంగ్లా పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది ఉన్నారా లేరా అంటూ ఆరాతీశారు. అలాగే నీలిపల్లెపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, కేంద్రానికి సరఫరా చేసిన ఐరన్, ఫోలిక్ యాసిడ్, మందుబిళ్లలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. ఆరోగ్యకేంద్రాల్లో 14రకాల టెస్టులను ఉచితంగా చేసి వారికి అవసరమైన మందులను అందజేయటం జరుగుతుందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్చి నెలలో 2 డెంగీ కేసులు నమోదయ్యాయని మరిన్ని కేసులు నమోదు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీహెచ్‌ఓ వహాబ్, సూపర్‌వైజర్ విజయలక్ష్మమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.